# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం - 20- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 46 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ కరోనా అలజడి

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో కొత్త కేసులు
- చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక నిఘా
- అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ సూచన



హైదరాబాద్/అమరావతి, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు): తెలుగు రాష్ట్రాల్లో కరోనా వైరస్ మళ్లీ స్వల్పంగా తలెత్తుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త కేసులు నమోదవుతుండగా, తెలంగాణలో కూడా అప్పుడప్పుడు కేసులు వెలుగుచూస్తుండటంతో ఆరోగ్యశాఖలు అప్రమత్తమయ్యాయి. ప్రస్తుతం వ్యాప్తి తీవ్రంగా లేదని అధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ, చిన్నారులు, వృద్ధులు, ఇప్పటికే ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. జిల్లాల వారీగా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య ఏర్పాట్లు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఇద్దరు చిన్నారులకు

మిగతా 2లో

## అర్హులైన ఒక్క ఓటూ కోల్పోవద్దు



- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి
- నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్న టీపీసీసీ అధ్యక్షుడు
- మహేష్ కుమార్ గౌడ్
- ఆగస్టు 3 వరకు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచన

హైదరాబాద్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత కీలకమైందని, అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించి ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. బూత్ స్థాయిలో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఆగస్టు 3వ తేదీ వరకు నాయకులందరూ ఎస్ఐఆర్ ప్రక్రియపైనే పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు పనులను వేగవంతం చేసి బూత్ స్థాయి ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

మిగతా 2లో

## అమెరికా చేరుకున్న మంత్రి సీతక్క

- టీటీఏ మహాసభలకు హాజరు
- ఉత్తర కరోలినాలో స్వాగతం
- తెలంగాణ ఖ్యాతిని చాటుతున్న ప్రవాసులు

షార్లెట్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు): టీటీఏ మహాసభల్లో పాల్గొనేందుకు అమెరికా చేరుకున్న రాష్ట్ర మంత్రి సీతక్కకు ఉత్తర కరోలినా రాష్ట్రంలోని షార్లెట్ విమానాశ్రయంలో టీటీఏ ప్రతినిధులు, ప్రవాస కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి ఆమెకు ఆత్మీయ స్వాగతం తెలిపారు.

మిగతా 2లో





## జువ్వాడి చొక్కారావు ఆశయాలే స్ఫూర్తి: పొన్నం ప్రభాకర్

- జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి
- పారదర్శక రాజకీయాలకు మారుపేరుగా జువ్వాడి చొక్కారావు
- వారి ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తాం
- ప్రజాసేవతోనే వారికి నిజమైన నివాళి

కరీంనగర్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు): దివంగత నేత, మాజీ మంత్రి, కరీంనగర్ మాజీ ఎంపీ జువ్వాడి చొక్కారావు జయంతి సందర్భంగా కరీంనగర్‌లోని వారి విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని చొక్కారావు సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జువ్వాడి చొక్కారావు రాజకీయాల్లో పారదర్శకత, నిబద్ధత, నిజాయితీకి ప్రతీకగా నిలిచారని అన్నారు.

మిగతా 2లో

## సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి: ఈటల

- హనుమాన్ చాలీసా మహాయజ్ఞంలో పాల్గొన్న ఎంపీ
- భారతీయ సంస్కృతిని కాపాడాలని పిలుపు
- ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

హైదరాబాద్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు): నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన హనుమాన్ చాలీసా మహాయజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధువులు, సంతులు, భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొని అనంతరం నిర్వహించిన సభలో ప్రసంగించారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది సాధువులు, సంతులు, కోట్లాది మంది భక్తులు వివిధ రూపాల్లో చేస్తున్న సేవలు అభినందనీయమని ఈటల రాజేందర్ అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో



## గిరిజన సంక్షేమమే లక్ష్యం



- స్నేహితుల సంఘం వార్షిక సమావేశంలో కిషన్ రెడ్డి
- గిరిజనుల అభ్యున్నతికి సేవలు ప్రశంసనీయం
- అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికీ చేరాలన్న పిలుపు

2లో

## కోరుట్లలో టీఆర్ఎస్ సంకల్ప సభ

- డాక్టర్ రఘుతో పాటు పలువురు చేరిక
- ప్రభుత్వంపై కవిత తీవ్ర విమర్శలు
- పార్టీ లక్ష్యాలను వివరించిన కవిత

కోరుట్ల, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు): కోరుట్లలో నిర్వహించిన టీఆర్ఎస్ పాంచజన్య సంకల్ప సభలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ భాజపా సీనియర్ నేత డాక్టర్ రఘుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కవిత ఆహ్వానం పలికారు. డాక్టర్ రఘు చేరికతో కోరుట్లలో పార్టీకి మరింత బలం చేకూరిందని ఆమె పేర్కొన్నారు. సభలో మాట్లాడిన కవిత సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ కరోనా అలజడి

(మొదటి పేజీ తరువాయి)



కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నిడిగుంటపాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు క్యాన్సర్ చికిత్స కోసం పుదుచ్చేరిలో ఉండగా కరోనా పాజిటివ్‌గా తేలింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడుకు చెందిన 13 ఏళ్ల బాలిక కిడ్నీ సంబంధిత సమస్యలతో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరీక్షల్లో కరోనా నిర్ధారణ అయింది. ఇద్దరు చిన్నారుల కుటుంబ సభ్యులకు నిర్వహించిన పరీక్షల్లో వైరస్ ఆనవాళ్లు కనిపించలేదని వైద్యులు వెల్లడించారు. బాధితులకు ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం జూన్ 26 నుంచి జూలై 16 వరకు రాష్ట్రంలో మొత్తం 12 కరోనా కేసులు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా ఎనిమిది కేసులు నమోదవగా, గుంటూరు జిల్లాలో రెండు, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కో కేసు నమోదైంది. ఇదే కాలంలో నాలుగు మరణాలు చోటుచేసుకున్నాయి. అయితే మరణించిన వారంతా రక్తపోటు, మధుమేహం, కిడ్నీ సంబంధిత వ్యాధులు వంటి ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారేనని అధికారులు వివరించారు. కరోనా ఒక్కటే మరణాలకు కారణం కాదని, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ప్రభావం చూపినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ప్రస్తుతం కరోనా పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ ఆసుపత్రుల్లో జ్వరం, శ్వాసకోశ సంబంధిత లక్షణాలతో వచ్చే రోగులకు అవసరమైనప్పుడు కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య సంస్థలకు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులు, ఆక్సిజన్, పడకలు సిద్ధంగా ఉంచాలని సూచనలు జారీ చేశారు. వైరస్ వ్యాప్తిపై నిరంతర నిఘా కొనసాగుతోందని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వైద్య నిపుణులు కరోనా పూర్తిగా అంతరించిపోలేదని, కాలానుగుణంగా స్వల్ప స్థాయిలో కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ముఖ్యంగా క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. అవసరమైన చోట మాస్క్ ధరించడం, చేతుల పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లు కొనసాగించడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం కరోనా పరిస్థితి ఆందోళనకర స్థాయిలో లేకపోయినా నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదని ఆరోగ్యశాఖలు స్పష్టం చేస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లాల వారీగా పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించాయి. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించాయి. అప్రమత్తత, వ్యక్తిగత పరిశుభ్రత, అవసరమైన వైద్య పరీక్షలు, ముందస్తు జాగ్రత్తల ద్వారానే కరోనా వ్యాప్తిని సమర్థంగా నియంత్రించవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

# అమెరికా చేరుకున్న మంత్రి సీతక్క

(మొదటి పేజీ తరువాయి)



మంత్రి సీతక్కకు వాణి రెడ్డి, విశ్వ కంది, నరేందర్ రెడ్డి, రాహుల్, గణేష్‌తో పాటు టీటీఏ ప్రతినిధులు, ప్రవాస భారతీయులు స్వాగతం పలికారు. అమెరికాలో తెలంగాణ ప్రజలు అందించిన ఆదరణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పేరును నిలబెడుతున్న ప్రవాస భారతీయుల సేవలు ప్రశంసనీయమని సీతక్క అన్నారు. తమ ప్రతిభ, కృషితో విదేశాల్లో గుర్తింపు తెచ్చుకుంటూనే స్వరాష్ట్రంతో అనుబంధాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచేందుకు ప్రవాస తెలంగాణవాసులు చేస్తున్న కృషి ఎంతో విలువైనదని మంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. టీటీఏ మహాసభలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు ప్రవాస తెలంగాణవాసుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని సీతక్క పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా పరస్పర సహకారం, అభివృద్ధిపై చర్చలు జరగనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి సీతక్క టీటీఏ మహాసభల్లో పాల్గొని ప్రవాస భారతీయులతో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, సామాజిక సేవా కార్యక్రమాలపై ప్రవాసులతో చర్చలు నిర్వహించనున్నట్లు సమాచారం.

# జువ్వాడి చొక్కారావు ఆశయాలే స్ఫూర్తి: పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)



ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జీవితాంతం సేవలందించిన మహోన్నత నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు.

జువ్వాడి చొక్కారావు చూపిన మార్గం, ప్రజల పట్ల ఉన్న అంకితభావం ఎంతో మంది ప్రజాప్రతినిధులకు స్ఫూర్తినిచ్చిందని మంత్రి తెలిపారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని జిల్లా అభివృద్ధి, ప్రజాసేవ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తామని చెప్పారు. ప్రజల విశ్వాసమే నాయకుడికి అతిపెద్ద బలం అనే సిద్ధాంతాన్ని జువ్వాడి చొక్కారావు తన రాజకీయ జీవితంలో ఆచరణలో చూపించారని మంత్రి పేర్కొన్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన జీవితం నిదర్శనమని కొనియాడారు.

వారి ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జువ్వాడి చొక్కారావు ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జయంతి సందర్భంగా జువ్వాడి చొక్కారావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి ఘన నివాళులర్పిస్తూ, వారు చూపిన ప్రజాసేవ మార్గంలో నడవడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

# అర్హులైన ఒక్క ఓటూ కోల్పోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ నాయకులు ఎంత అంకితభావంతో పనిచేస్తారో, అదే స్థాయిలో ఇప్పుడు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియలో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు నాయకులు తమ నియోజకవర్గాల్లోనే ఉండి ప్రతి దశను పర్యవేక్షించాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడటం ప్రతి నాయకుడి బాధ్యత అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి: ఈటల

(మొదటి పేజీ తరువాయి)



ఛత్రపతి శివాజీ మహారాజ్ హైందవ ధర్మ పరిరక్షణ కోసం చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ పునరంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ చరిత్రలో శివాజీ మహారాజ్ సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయని తెలిపారు. ప్రపంచ శాంతి, సర్వేజనుల సంక్షేమాన్ని కోరే గొప్ప సంప్రదాయం భారతీయ ధర్మానిదేనని ఈటల రాజేందర్ అన్నారు. ఒకప్పుడు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిన భారతదేశం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం భారతీయ సంస్కృతి, ఆలయాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అయోధ్యలో ఆలయ నిర్మాణం దేశ చరిత్రలో ఒక విశిష్ట ఘట్టమని అన్నారు. విధ్వంసానికి గురైన ఆలయాల పునరుద్ధరణతో పాటు భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై సమాజంలో ధార్మిక విలువలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లో నిర్వహించనున్న హనుమాన్ చాలీసా మహాయజ్ఞ మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న నిర్వాహకులను ఈటల రాజేందర్ అభినందించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణ కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.



# కోరుట్లలో టీఆర్ఎస్ సంకల్ప సభ

(మొదటి పేజీ తరువాయి)

గోదావరిలో అందుబాటులో ఉండాల్సిన నీటి నిల్వలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. సాగునీటి కంటే తాగునీటి సమస్యే తీవ్రమవుతోందని, రైతులకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కూడా ఆమె స్పందించారు. మేడిగడ్డతో సంబంధం లేకుండానే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ అవకాశాన్ని వినియోగించుకోవడం లేదని అన్నారు. ప్రజలు ఏ సమస్యను ప్రస్తావించినా ప్రభుత్వం సమాధానం చెప్పకుండా ఎదురుదాడి చేస్తోందని విమర్శించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో అవినీతి, బీసీల సమస్యలపై అంతర్గతంగా ప్రశ్నించానని, ఆ కారణంగానే తనపై కుట్ర చేసి పార్టీ నుంచి పంపించారని కవిత అన్నారు. ప్రజల అస్తిత్వం, సామాజిక న్యాయం కోసం టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశానని తెలిపారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, రైతులకు ప్రత్యేక సేవలు, అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పిస్తామని కవిత హామీ ఇచ్చారు. అవినీతిని అరికడితే ప్రస్తుతం ఉన్న బడ్జెట్‌తోనే ఈ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. రైతులు, యువత, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు అభివృద్ధి చెందే విధంగా పాలన అందిస్తామని చెప్పారు. సభ అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్లబోనని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ రానున్న ఎన్నికల్లో బలమైన రాజకీయ శక్తిగా అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కొత్తగా చేరిన నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమమే లక్ష్యం

**రంగారెడ్డి, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**



రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో నిర్వహించిన గిరిజన స్నేహితుల సంఘం వార్షిక సమావేశం-2026లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గిరిజన సోదర సోదరీమణుల సంక్షేమం, సాధికారత కోసం గిరిజన స్నేహితుల సంఘం, హైదరాబాద్ విభాగం ఎన్నో ఏళ్లుగా చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. గిరిజన సమాజ అభివృద్ధి కోసం సేవా దృక్పథంతో పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా ప్రశంసించారు. గిరిజనుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి సమాజం మొత్తం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గిరిజనులు తరతరాలుగా అడవులు, నదులు, పర్వతాలు, జీవ వైవిధ్యాన్ని అత్యంత బాధ్యతతో పరిరక్షిస్తూ ప్రకృతితో మమేకమైన జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. నేడు ప్రపంచం సుస్థిర అభివృద్ధి గురించి చర్చిస్తున్నా, గిరిజన సమాజం ఎంతోకాలం నుంచే ప్రకృతిని కాపాడుతూ ఆదర్శవంతమైన జీవన విధానాన్ని అనుసరిస్తోందని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణలో గిరిజనుల పాత్ర దేశానికి గర్వకారణమని కొనియాడారు. వారి సంప్రదాయాలు, సంస్కృతి, జీవన విలువలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. భారతీయ నాగరికతలో గిరిజన సంప్రదాయాలకు ప్రత్యేక స్థానం ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీరాముడు శబరి మాతపై చూపిన గౌరవం, ఒడిశాలోని సబర సమాజంతో జగన్నాథ స్వామికి ఉన్న అనుబంధం వంటి ఉదాహరణలు గిరిజన సంస్కృతి భారత చరిత్రలో ఎంతటి విశిష్ట స్థానాన్ని కలిగి ఉందో తెలియజేస్తాయని అన్నారు. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు దేశ సాంస్కృతిక వారసత్వంలో విడదీయరాని భాగమని తెలిపారు. ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి ఫలాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరాలని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "అభివృద్ధి కూడా... వారసత్వం కూడా" అనే దార్శనికతకు ఇదే నిజమైన స్ఫూర్తి అని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, జీవన విధానాన్ని కూడా పరిరక్షించడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గిరిజన యువత విద్య, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి రంగాల్లో మరింత ముందుకు రావాలని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చివరి గిరిజన కుటుంబానికి చేరేలా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే కార్యక్రమాలను మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు. సమగ్ర అభివృద్ధి ద్వారానే అభివృద్ధి చెందిన భారత నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వార్షిక సమావేశంలో గిరిజన స్నేహితుల సంఘం ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సామాజిక కార్యకర్తలు, గిరిజన ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. గిరిజన సంక్షేమం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక సాధికారతకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గిరిజన సమాజ అభ్యున్నతికి సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలను ఈ సందర్భంగా అభినందించారు. సమాజంలోని ప్రతి వర్గం భాగస్వామ్యంతోనే గిరిజనుల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# చిన్నారెడ్డి నియామకం హర్షణీయం

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,జులై19(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నా రెడ్డి గారిని చైర్మన్‌గా నియమించడం హర్షణీయమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ వంటి కీలక రంగాలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఈ కమిటీ కీలకంగా పనిచేస్తుందన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించడం, జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించడం ద్వారా ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతమైన కార్యాచరణ అమలు అవుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.డా. జి. చిన్నారెడ్డి అనుభవం, పరిపాలనా దక్షత రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతాయని పేర్కొన్న ఎమ్మెల్యే, ఆయన నాయకత్వంలో కమిటీ సమర్థవంతంగా పనిచేసి రైతాంగానికి, ప్రజలకు అండగా నిలుస్తుందని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# చిలుకటోనిపల్లి ఊకచెట్టు వాగులో మొసలి పట్టివేత



**పెద్దమందడి,జులై19(తెలంగాణ ముచ్చట్లు):**వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలుకటోనిపల్లి గ్రామ శివారులోని ఊక చెట్టు వాగులో మొసలి కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే స్నేక్ సొసైటీ సభ్యుడు కృష్ణసాగర్‌తో పాటు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న కృష్ణసాగర్, అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మొసలిని సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం మొసలిని అటవీశాఖ ఆధీనంలోకి తీసుకుని సురక్షితమైన సహజ ఆవాసంలో విడిచిపెట్టేందుకు తరలించారు.మొసలి పట్టివేతతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వాగులు, చెరువుల వద్దకు వెళ్లే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

# వడ్డెరల అభ్యున్నతికి నూతన నాయకత్వం

- మండల అధ్యక్షుడిగా గొల్లెన ఎల్లయ్య నియామకం



**ఎల్కతుర్తి, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):** వడ్డెరల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఎల్కతుర్తి మండల వడ్డెర సంఘానికి నూతన నాయకత్వం ఏర్పాటైంది. తెలంగాణ వడ్డెర సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు బొంత రమేష్ అధ్యక్షతన ఆదివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు ముఖ్య అతిథిగా హాజరై, మండలంలోని వివిధ గ్రామాల కుల పెద్దల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా గొల్లెన ఎల్లయ్య (దండేపల్లి), ప్రధాన కార్యదర్శిగా అల్లెపు ప్రశాంత్ (దామెర), కోశాధికారిగా అల్లెపు రాజు (దామెర)తో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, పట్టణ అధ్యక్షుడు, యూత్ ఇన్‌చార్జిని ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ ఎల్కతుర్తి మండలంలో మూడు వేలకుపైగా వడ్డెరలు నివసిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం బలమైన మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వడ్డెర సంఘం ఎన్నో ఏళ్లుగా కోరుతున్న న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. వడ్డెరలకు విద్య, ఉపాధి, గృహాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పించి వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలు శివరాత్రి రాజమ్మ, రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు వల్లెపు సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర రవీందర్, జిల్లా కోశాధికారి వల్లెపు సాంబరాజు, జిల్లా ఉపాధ్యక్షులు వల్లపు సుధాకర్, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు వల్లపు రంజిత్ కుమార్, ధర్మసాగర్ మండల ఉపాధ్యక్షులు వల్లపు వెంకన్న, వివిధ గ్రామాల కుల పెద్దలు, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా రైస్ మిల్లర్స్ ఉపాధ్యక్షుడు సయ్యద్ పాషాను సన్మానించిన పలుస శంకర్ గౌడ్



**వనపర్తి,జూలై19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరంగాపూర్ మండలానికి చెందిన సయ్యద్ పాషాను సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. వనపర్తి పట్టణంలోని కళ్యాణ సాయి ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ, రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యక్షుడిగా సయ్యద్ పాషా సమర్థవంతంగా కృషి చేసి, మిల్లర్ల సంక్షేమానికి పాటుపడాలని ఆకాంక్షించారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఆయన ఎన్నిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు, మాజీ కౌన్సిలర్లు జి.జె. శ్రీనివాసులు, గులాం ఖాదర్, లెక్చరర్ కురుమూర్తి, ఉపాధ్యాయులు కురుమూర్తి తదితరులు పాల్గొని సయ్యద్ పాషాకు శుభాకాంక్షలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్‌కు అమ్మవారి ఆశీస్సులు కోరిన జమ్మికుంట జనసేన శ్రేణులు




**జమ్మికుంట టౌన్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన జనసేన పార్టీ నాయకులు, వీరాభిమానులు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని వారు అమ్మవారిని ప్రార్థించారు.

ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరింత విస్తృతంగా సేవలు అందించాలని, అలాగే తెలంగాణ ప్రజలకు కూడా తన సేవలను మరింత విస్తరించాలని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా దేశ ప్రజల సుఖశాంతులు, రాష్ట్రాల అభివృద్ధి కోసం కూడా వారు ప్రార్థనలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జనసేన వీరాభిమానులు పాతకాల రాజేంద్రప్రసాద్, పర్వతం మహేష్, ఇల్లందుల శివకృష్ణ, చలిగంటి కుమార్, గురుకుంట్ల శ్రీకాంత్, వద్దేన శ్రీనివాస్, కాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.

# కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటుతున్న కుమారి శృతి



**వనపర్తి,జూలై19(తెలంగాణ ముచ్చట్లు):** సాంప్రదాయ కూచిపూడి నృత్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న కుమారి శృతిని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అభినందించారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ఆమె స్వగృహంలో శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. కళాకారులైన గుడిసె పార్వతి, గుడిసె శివలింగంల కుమార్తె శృతి చిన్ననాటి నుంచే కూచిపూడి నృత్యంలో విశేష ప్రతిభ కనబరుస్తూ పలు పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇటీవల కళా ఉత్సవ్‌లో జిల్లా తరఫున జాతీయ స్థాయిలో పాల్గొని ప్రశంసలు పొందడంతో పాటు, భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన కూచిపూడి కళా వైభవం -మహా బృంద నాట్యంలో పాల్గొని కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషమన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రముఖుల చేతుల మీదుగా సన్మానాలు అందుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బైరోజు చంద్రశేఖర్, ఎం.ఎ. సత్తార్, దేశి రాములు యాదవ్, గంధం నాగరాజు, నిరంజన్, శ్రీనివాస్ రెడ్డి, డా. శ్యాంసుందర్, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ ఎస్సీ డిపార్ట్ మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ గా నారపోగు వెంకటేశ్వర్లు..

- రాష్ట్ర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపిన వెంకట్..



**ఖమ్మం బ్యూరో,జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర వైస్ చైర్మన్ గా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ నుండి నియామకపు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కు ప్రత్యేక శుభాకాంక్షలు ధన్యవాదాలు తెలిపారు. తన నియమకానికి సహకరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ కవంపల్లి సత్యనారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలు అధికంగా ఉన్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరి దృష్టికి తీసుకెళ్తానని, పార్టీ మరలా అధికారంలోరావడానికి కృషి చేస్తానని వెంకట్ అన్నారు.

# వర్షాల కోసం తల్లాడలో ముస్లిం సోదరుల ప్రార్థనలు..



**ఖమ్మం బ్యూరో,జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు ):** వర్షాలు సకాలంలో కురిసి రైతుల పంటలు పండాలని తల్లాడలో ముస్లిం సోదరులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్ద ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ను చదివి వర్షాలు కురవాలని ప్రార్థనలు చేశారు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు సాగు చేయలేని పరిస్థితిలో ఉన్నారని, వర్షాలు పడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్. ఈసూబ్, అక్బర్, మౌలి సాబ్ ముజీబ్,నిజాముద్దీన్,గాలి, జాన్ పాషా, మస్తాన్, మున్నా, సలీం, ముస్తఫా, అబ్దుల్ రెహమాన్, వద్దండి సాహెబ్, మే బల్లి,బాజీ,ఖాసీం, ఇలియాజ్,తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యకు మరో అవకాశం... దూరవిద్య డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం



**జమ్మికుంట టౌన్ జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్య అధ్యయన కేంద్రం ద్వారా నిర్వహించే డిగ్రీ కోర్సులు (బీఏ, బీకాం, బీఎస్సీ) ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 7, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రమేష్, దూరవిద్య కేంద్రం కోఆర్డినేటర్ రాజేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో చదువుతున్న విద్యార్థులు నిర్ణీత గడువులోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారు, చదువును మధ్యలో నిలిపివేసి తిరిగి కొనసాగించాలనుకునే వారికి దూరవిద్య కోర్సులు మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలోని దూరవిద్య అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ఖమ్మం బ్యూరో, జులై 19(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు వివిధ ఆసుపత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం ఖర్చు పెట్టిన నేరడ గ్రామానికి చెందిన 5గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులు ను లబ్ధిదారులు కి అందజేశారు.

1) ఎస్ కే బాబు 23500/
2) ఎస్ కే మీరాబి 32,500/
3) గంగుల ఇందిరా 22500/
4) చల్లా లక్ష్మి నారాయణ 16500/ 5)ఎస్ కే మీరాబి మౌల్ సాహెబ్ 19000/
6).పొన్నం రమేష్‌లకు మంజూరు అయిన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను నేరడ గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మంకెన నాగేశ్వర రావు ,ఉప సర్పంచ్ కోట బాలయేసు గ్రామ నాయకులు చెవుల తిరుపతి రావు ,పొన్న రమేష్ ,వనం పుల్లారావు , ఎస్ కే బాబు కోట తిరుపతి వెంకులు సొంపుగు బాలకృష్ణ ,కనకపూడి శంకర్ రావు మరియు లబ్దిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా..ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క కి లబ్ధిదారులు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసినారు



సోమవారం - 20 - జూలై 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# భూ రీ-సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



- **రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
- **శ్రీనివాసగుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి**
- **సమగ్ర సమీక్షా సమావేశంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం బ్యూరో, జులై 19(తెలంగాణ ముచ్చట్లు ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్‌లో జిల్లాలో భూముల రీ సర్వే ప్రగతి, అటవీరెవెన్యూ భూ సమస్యలు, పోడు భూముల అంశం, పాల్వంచ శ్రీనివాసగుట్ట అభివృద్ధిపై ఆయన అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. జిల్లాలో సర్వే పనులు మరింత వేగంగా ముందుకు సాగాలని, ఎక్కడా జాప్యానికి తావులేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 14 గ్రామాల్లో పనులు కొనసాగుతుండగా, ఐదు గ్రామాల్లో సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మిగిలిన గ్రామాల్లోనూ నిర్దేశిత కాలవ్యవధిలోగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేయర్లు, రోవర్ పరికరాల కొరత రాకుండా అవసరమైన చోట అదనపు వనరులను సమకూర్చుకోవాలని ఆదేశించారు.

**సమన్వయంతోనే భూ సమస్యల పరిష్కారం**

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అటవీరెవెన్యూ భూ సమస్యలను సామరస్యపూర్వకంగా, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రతి నెలా సమీక్షా సమావేశాల ద్వారా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కొత్తగా పోడు సాగు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూనే.. గతంలో పోడు సాగు చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వ విధానాల ప్రకారం, మానవీయ కోణంలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

**శ్రీనివాసగుట్టకు పర్యాటక శోభ**

పాల్వంచలోని శ్రీనివాసగుట్ట ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేలా రహదారి నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యా చందన, డీఆర్ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుడిపూడి జగదీష్ జన్మదిన వేడుకలు

- **కేక్ కటింగ్, శాలువాలతో సన్మానం, బాంబులు, డిజెలతో అంబరాన్నంటిన సంబరాలు**



**ఖమ్మం బ్యూరో, జులై 19(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీ గుడిపూడి జగదీష్ పుట్టినరోజు సందర్భంగా 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని 182, 183, 184, 185, 186, 187 బూత్‌ల పరిధిలో వేడుకలు అంగరంగ వైభవంగా, ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఉదయం నుంచే బూత్‌ల వారీగా ఏర్పాట్లు చురుగ్గా సాగాయి, కార్యకర్తలు అంకితభావంతో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించారు.

కార్యక్రమంలో భాగంగా ఘనంగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా వాతావరణం అంతా సంబరాల వాతావరణంగా మారింది. కేక్ కటింగ్ అనంతరం గుడిపూడి జగదీష్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలతో ఘనంగా సన్మానించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వేదిక వద్ద పూదిన దండలతో, పూలదండలతో, శాలువాలతో నాయకుడిని ముంచెత్తారు.

వేడుకల్లో భాగంగా బాంబులు పేల్చి, డిజె సంగీతంతో యువత, కార్యకర్తలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. బూత్‌ల వారీగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలు 182, 183, 184, 185, 186, 187 బూత్‌ల పరిధిలో ఒకదాని తర్వాత ఒకటి కొనసాగుతూ, ప్రతి బూత్ పరిధిలోనూ ఉత్సాహం ఉరకలెత్తింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సైతం ఈ వేడుకలను తిలకించేందుకు తరలివచ్చారు.

ఈ సందర్భంగా గుడిపూడి జగదీష్ మాట్లాడుతూ, పార్టీ శ్రేణుల మధ్య ఐక్యత, సమన్వయం అత్యంత ముఖ్యమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తనకు లభించిన ఈ అభిమానం, ఆదరణ తనను మరింత బాధ్యతాయుతంగా పనిచేసేలా ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని, ప్రజల మధ్యే ఉండి, వారి సుఖదుఃఖాలలో పాలుపంచుకుంటూ అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, బూత్ స్థాయి కమిటీ సభ్యులు, వార్డు నాయకులు, యువజన కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో, సందడిగా, కోలాహలంగా సాగింది. చివరిలో గుడిపూడి జగదీష్ అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలకు మరింత మద్దతు ఇవ్వాలని కోరారు.

# కొత్తగూడెం–పాల్వంచ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- **రూ.14 కోట్లతో దమ్మపేట–పాల్వంచ నాలుగు లేన్ల రహదారి విస్తరణకు శంకుస్థాపన**
- **రూ.50 లక్షలతో సీసీ రోడ్డు.. మరో రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు**
- **రూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు**
- **తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ఖమ్మం బ్యూరో, జులై 19(తెలంగాణ ముచ్చట్లు ):** కొత్తగూడెం-పాల్వంచ జంట పట్టణాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దమ్మపేట-పాల్వంచ ప్రధాన రహదారిలో జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.14 కోట్లతో చేపట్టనున్న రెండున్నర కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మంచికంటి నగర్ హర్ష టౌన్‌షిప్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, పోస్టాఫీస్ సెంటర్ నుంచి గోదుమవాగు వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్, డివైడర్ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల దమ్మపేట-పాల్వంచ రహదారి దెబ్బతిని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దీనిపై స్పందించి అత్యవసరంగా రూ.14 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

పాల్వంచ ప్రాంతంలో దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే కొన్ని సర్వేలు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సింగరేణి పరివాహక ప్రాంత ప్రజలకు సంబంధించిన జీవో-76 అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, త్వరలోనే దీనిపై స్పష్టత ఇస్తామన్నారు. పాల్వంచలో కాలుష్య రహిత పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని, కొత్తగూడెం పరిసరాల్లో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు ముమ్మరం చేశామని వివరించారు.

**సవాళ్లున్నా.. సంక్షేమంలో వెనకడుగు లేదు**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ హామీల అమలులో ఎక్కడా వెనకడుగు వేయడం లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిరంతరాయంగా సాగుతున్నాయన్నారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ గృహాల పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సుమారు 8 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపామని, ఇప్పటికే 1.50 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. అలాగే, గురుకుల విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచడంతో పాటు, 70 వేల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసి యువతకు భరోసానిచ్చామని గుర్తుచేశారు.

**ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి**

జిల్లాలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మంత్రి కోరారు. నష్టాలు రాకుండా మెట్ట పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కమిషనర్ సుజాత, అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# పుష్కరాల లోపే భద్రాద్రి వైభవం!

- **వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి కావాలి**
- **15 రోజుల ముందే సిద్ధం చేయండి : అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**
- **రూ.351 కోట్లతో పనులు.. రూ.75 కోట్లతో భూసేకరణ**
- **పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి.. పది రోజులకోసారి సమీక్ష చేస్తామని వెల్లడి**

**ఖమ్మం బ్యూరో, జులై 19(తెలంగాణ ముచ్చట్లు ):**రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాచీన వైభవానికి ప్రతీకగా నిలిచేలా పునరుద్ధరణ పనులను వచ్చే గోదావరి పుష్కరాల నాటికి వంద శాతం పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. పుష్కరాల ప్రారంభానికి 15 రోజుల ముందే క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సబ్ కలెక్టర్ కార్యాలయంలో దేవాదాయ, ఇంజినీరింగ్ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మొదటి శ్రీరామనవమి పర్వదినాన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భద్రాద్రి పునరుద్ధరణకు నాంది పలికాం. ఇందుకోసం ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసింది. ఆలయ విస్తరణ, అభివృద్ధికి అత్యంత కీలకమైన భూసేకరణ ప్రక్రియ కోసం ఇప్పటికే రూ.75 కోట్లు వెచ్చించాం" అని వివరించారు.

**ఆగమశాస్త్రం ప్రకారం.. అదనపు కార్మికులతో!**

భద్రాద్రి క్షేత్ర ఆధ్యాత్మిక, చారిత్రక విశిష్టత చెక్కుచెదరకుండా, నిపుణులైన శిల్పులతో, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. "పురాతన గోపురాలు, కట్టడాల సహజత్వానికి భంగం కలగకుండా ఆగమశాస్త్రాల ప్రకారం పనులు జరగాలి. పనుల్లో వేగం పెంచేందుకు అవసరమైన చోట ప్రస్తుత సిబ్బంది కంటే 25 శాతం అదనంగా కార్మికులను నియమించాలి. నిరంతరం నిపుణులు, బాధ్యతాయుతమైన అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షించాలి" అని ఆదేశించారు. ఒకవైపు పనులు పూర్తయిన తర్వాతే మరోవైపు పనులు ప్రారంభించాలని, ఎక్కువ పని ఉన్న ఉత్తర భాగంలో పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రాయింగ్‌లు, సాంకేతిక అనుమతుల్లో జాప్యానికి తావులేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు.

**పది రోజులకోసారి క్షేత్రస్థాయి సమీక్ష**

ఆలయ పనుల పర్యవేక్షణ కోసం ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని వెంటనే నియమించాలని దేవాదాయ కమిషనర్ హనుమంతరావును మంత్రి టెలిఫోన్ ద్వారా ఆదేశించారు. కమిషనర్ ప్రతి 10 రోజులకోసారి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రగతిని పరిశీలించాలన్నారు. పనులు జరుగుతున్న సమయంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతంలో భక్తుల విజ్ఞప్తుల మేరకు నూతన స్నాన ఘట్టాల నిర్మాణం, యాత్రికుల వసతుల విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. తొలుత సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్ వద్ద మంత్రికి కలెక్టర్ అంకిత్ మొక్క అందించి స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఈవో దామోదరరావు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంత్రికి వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం దొర, ఆర్కిటెక్ట్ మూర్తి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అగ్రహారం గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

ఖమ్మం బ్యూరో, జూలై 19(తెలంగాణ ముచ్చట్లు ): కూసుమంచి మండలం అగ్రహారం గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి పాలేరు ఎమ్మెల్యే మరియు రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘనంగా శంకుస్థాపన చేశారు. స్థానిక సర్పంచ్ మల్లెల స్వాతి లతో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఈ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 20లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన



సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోం దని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం క్రమంగా నెరవేరు స్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, అర్హులైన గృహాలకు ఉచిత కరెంట్ సరఫరా అందిస్తున్నామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా నూతన గ్రామపంచాయతీ భవనామునకు స్థలం ఇచ్చిన మల్లెల మన్మధ రావు ను మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర ఉపేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గోడే కోటేశ్వరమ్మ గ్రామ 8వ వార్డు సభ్యులు కర్ల రామారావు, మల్లెల ఉపేందర్, మల్లెల మధుసూదన్ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే బలం కొత్త కమిటీలతో బీజేపీ దూకుడు

**ఎల్కతుర్తి, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలో భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతానికి జిల్లా నాయకత్వం మార్గదర్శకత్వంలో మండల నూతన కమిటీతో పాటు అనుబంధ విభాగాల (మోర్చా) కమిటీలను ప్రకటించారు. మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఈ వివరాలను వెల్లడించారు.
మండల ఉపాధ్యక్షులుగా అంబేరు శ్రీనివాస్, కనుకుంట్ల రామనాచారి, కడారి ప్రసాద్, వెల్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా అల్లి కుమార్, చిదురాల వెంకటేష్, కార్యదర్శులుగా కొడం రమేష్, మాతూరి విద్యాసాగర్, గణేష్ శ్రీనివాస్, చిర్రా శ్రీనివాస్లను నియమించారు. కోశాధికారిగా హింగే దేవరావు, సోషల్ మీడియా కన్వీనర్గా పోలు శివసేన బాధ్యతలు చేపట్టనున్నారు.
అనుబంధ విభాగాల్లో యువ మోర్చా అధ్యక్షుడిగా గణబోయిన నాగరాజు, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గడ్డం మధుకర్ రెడ్డి, ఒబీసీ మోర్చా అధ్యక్షుడిగా పోలు నరేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ఎర్రోళ్ల రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నంపల్లి మమతలను నియమించారు.



ఈ సందర్భంగా మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, "కార్యకర్తలే బలం" అనే నినాదంతో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తూ పార్టీ విస్తరణకు కృషి చేస్తామని తెలిపారు. నూతన కమిటీ ఏర్పాటుకు సహకరించిన సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, ఖమ్మం వెంకటేశం, గుర్రాల లక్ష్మారెడ్డిలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# తాటికాయల సంజీవ మృతికి నివాళులర్పించిన తాటికొండ రాజయ్య



**ధర్మసాగర్,జులై19(తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తాటికాయల చిరంజీవి సోదరుడు తాటికాయల సంజీవ అనారోగ్యంతో మృతిచెందడం పట్ల తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ధర్మసాగర్ మండలం మలక్‌పల్లి గ్రామంలోని సంజీవ నివాసానికి వెళ్లిన రాజయ్య, ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తాటికాయల చిరంజీవితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాంక్షిస్తూ తన సానుభూతిని తెలియజేశారు. దివంగత సంజీవ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును భరించే శక్తిని ప్రసాదించాలని కోరుతూ బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ నాయకులు సంతాపం తెలిపారు.

# మామునూరు విమానాశ్రయ నిర్మాణంలో కాకతీయ వైభవం ప్రతిబింబించాలి



## ఎంపీ కడియం కావ్య

**హైదరాబాద్,జులై19(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ చారిత్రక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా, కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా మామునూరు విమానాశ్రయం రూపుదిద్దుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్‌లో భారతీయ దేవాలయ వాస్తుశిల్పం, శిల్పశాస్త్రం, వారసత్వ పరిరక్షణ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగి రెడ్డితో ఎంపీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన పలు డిజైన్ నమూనాలను పరిశీలించి, వాటిపై సవివరంగా చర్చించారు.
విమానాశ్రయం రూపకల్పనలో వరంగల్ చారిత్రక విశిష్టత, కాకతీయుల వారసత్వం స్పష్టంగా ప్రతిబింబించేలా డిజైన్ రూపొందించాలని సూచించారు. ఇందుకోసం కాకతీయుల నిర్మాణ శైలి, చారిత్రక కట్టడాల ప్రత్యేకతలు, వారసత్వ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని అభిప్రాయపడ్డారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయంలో అడుగుపెట్టిన క్షణం నుంచే వరంగల్ గొప్ప చారిత్రక, సాంస్కృతిక నగరమనే భావన కలిగేలా నిర్మాణ శైలి ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల ఆలయం, కాకతీయుల శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబించే ఆకృతులు, నమూనాలు విమానాశ్రయ నిర్మాణంలో పొందుపరచాలని సూచించారు. భవిష్యత్ తరాలకు కాకతీయుల చారిత్రక వారసత్వాన్ని పరిచయం చేసే సాంస్కృతిక చిహ్నంగా మామునూరు విమానాశ్రయం నిలవాలని ఆకాంక్షించారు.

# రైతు సంక్షేమానికి రైస్ మిల్లర్ల సహకారం కీలకం

- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



**వనపర్తి,జూలై19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా రైస్ మిల్లర్స్ యూనియన్ నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రైస్ మిల్లర్స్ యూనియన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన ధనలక్ష్మి శేఖర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బీమా, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్స్ యూనియన్ నాయకత్వం రైతులు, వ్యాపారులు, వినియోగదారుల మధ్య వారధిగా నిలిచి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైస్ మిల్లర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, రైతులు పండించిన ధాన్యానికి విలువను జోడించి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందించడం వారి గొప్ప సేవ అని కొనియాడారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల విజయవంతమైన అమలుకు రైస్ మిల్లర్ల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. బియ్యం నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించడం ద్వారా వినియోగదారుల విశ్వాసాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఐకమత్యంతో పనిచేస్తే ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. వనపర్తి జిల్లా రైస్ మిల్లర్స్ యూనియన్ రాష్ట్రంలో ఆదర్శ సంస్థగా ఎదగాలని ఆకాంక్షించిన డాక్టర్ చిన్నారెడ్డి, నూతన అధ్యక్షురాలు ధనలక్ష్మి శేఖర్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# సెప్టెంబర్ 16న ఉస్మానియాలో రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం

## డాక్టర్ పిడమర్తి రవి



**హైదరాబాద్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):** తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనాన్ని సెప్టెంబర్ 16న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ బహిరంగ సభగా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకుడు, మాజీ తెలంగాణ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు, ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర ఏర్పాటుకు సేవలందించిన ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు, సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. ఈ లక్ష్యంతోనే తమ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.
తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కేకే కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ, ఈ నిర్ణయం ఉద్యమకారుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయమైన హక్కులు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డు, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వ దృష్టి ఆకర్షించేందుకు సెప్టెంబర్ 16న నిర్వహించే సమ్మేళనం వేదికగా నిలుస్తుందని తెలిపారు.
సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, విశ్వవిద్యాలయాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు నాయకులు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిర్వహించిన విద్యార్థి గర్జన సభ స్థాయిలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాత్రిక స్వప్న, రాస వెంకట్ ముదిరాజ్, వడ్డే ఎల్లన్న, సంపత్ నాయక్, గద్దల అంజిబాబు, సాంబశివ గౌడ్, చెరుకు మణికంఠ, ఎండి రహీం, ఎండల ప్రదీప్, గడ్డం శ్రీరామ్, డాక్టర్ రేష్మ హుస్సేన్, కందుల శ్రీను, ముత్యం గౌడ్, అందే కృష్ణ, దర్శనం జాన్, మండ్ల రవి, పల్స ఆంజనేయులు, బోరెల్లి సురేష్, వెంకట్, తిరుమనపల్లి ప్రశాంత్, వెంకట్ నాయక్, జోగు గణేష్, మొగిలిగిద్ద ప్రసాద్, కల్వకుర్తి శ్రీశైలం, ఆరెకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 7న బెంగళూరులో జరిగే ఓబీసీ 11వ మహాసభను విజయవంతం చేయాలి

## ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్



**నర్సంపేట,జులై19(తెలంగాణ ముచ్చట్లు):** ఆగస్టు 7న కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో నిర్వహించే అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభను విజయవంతం చేయాలని బీసీ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ, బెంగళూరులో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభకు దేశవ్యాప్తంగా వేలాది మంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీ కులగణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని, బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో డిలిమిటేషన్, మహిళా బిల్లులపై విస్తృత చర్చ జరగనున్న నేపథ్యంలో, ఈ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించాలని కోరారు. డిలిమిటేషన్, మహిళా బిల్లుల వల్ల బీసీలకు రాజకీయంగా ప్రయోజనం ఉండదని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.
డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఆగస్టు 7న జరిగే మహాసభకు వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి కురుమ, యూత్ జిల్లా అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, గట్ల నర్సింహరాములు, తాబేటి ప్రకాష్, జక్కుల రేణుక, కర్రు రాధిక తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు: ప్రణవ్

- **నిజమైన నిరుపేదలకే ఇళ్ల మంజూరు చేస్తాం**

**హుజూరాబాద్, జూలై 19(తెలంగాణ ముచ్చట్లు ):** మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకంగా జరిగిందని, రెండో విడతలో కూడా నిజమైన అర్హత కలిగిన నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేస్తామని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ తెలిపారు. ఆదివారం హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో ఎం.డి. మౌలానా, సలీమ్ బీ దంపతుల ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు లేకుండా చేయడమే తమ సంకల్పమని పేర్కొన్నారు. మొదటి విడతలో పారదర్శకంగా ఇళ్ల కేటాయింపులు జరిగినట్లే రెండో విడతలో కూడా ఎలాంటి వివక్షకు తావులేకుండా అర్హులైన లబ్ధిదారులకే ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నడి మాధవి, ఉప సర్పంచ్ కాశిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, కాంగ్రెస్ నాయకులు అన్నడి రవీందర్ రెడ్డి, యాళ్ల రాజేశ్వర్ రెడ్డి, భాస్కర్, రాజు, రాంరెడ్డి, రత్నాకర్ రెడ్డి, మల్లేష్, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పిల్లల ఆలింగనమే గొప్ప బహుమతి

- **ఆప్యాయతతో పెరిగితేనే పిల్లల్లో ఆత్మవిశ్వాసం**
- **ప్రేమను వ్యక్తం చేసే అద్భుతమైన మార్గం ఆలింగనం**
- **కుటుంబ బంధాలను మరింత బలపరిచే చిన్న చర్య**
- **ప్రతి రోజూ కొద్ది నిమిషాలు పిల్లలతో గడపడం ఎంతో అవసరం**

**డెస్క్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ పిల్లలను ఆలింగనం చేసుకునే దినం ప్రతి సంవత్సరం జూలైలో మూడో సోమవారం నిర్వహిస్తారు. ఈ దినం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం తల్లిదండ్రులు, పిల్లల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే. పిల్లలతో ప్రేమగా మాట్లాడటం, వారిని హత్తుకోవడం, వారి భావాలను అర్థం చేసుకోవడం కుటుంబ బంధాలను మరింత దృఢంగా మారుస్తుంది. ఆధునిక జీవనశైలిలో తీరిక లేకుండా గడిపే తల్లిదండ్రులకు ఈ దినం ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. పిల్లలకు అవసరమయ్యేది ఖరీదైన బహుమతులు కాదని, ప్రేమతో కూడిన సమయం, ఆప్యాయత, ఆలింగనమేనని గుర్తు చేస్తుంది. పిల్లల మానసిక ఎదుగుదలలో తల్లిదండ్రుల ప్రేమ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. చిన్నతనం నుంచే ప్రేమతో పెరిగిన పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం, సానుకూల ఆలోచనలు ఎక్కువగా ఉంటాయి. తల్లిదండ్రులు తమను ప్రేమిస్తున్నారని పిల్లలకు తెలిసినప్పుడు వారు ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొనే మనోబలాన్ని పొందుతారు. ఇంట్లో సురక్షితమైన, ప్రేమతో కూడిన వాతావరణం ఉంటే పిల్లలు చదువులోనే కాకుండా వ్యక్తిత్వ వికాసంలో కూడా ముందంజలో ఉంటారని నిపుణులు చెబుతున్నారు.

ప్రస్తుత కాలంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువులు, సాంకేతిక పరికరాల వినియోగం కారణంగా కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష సంభాషణలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఒకే ఇంట్లో ఉంటూ కూడా చాలామంది తమ సమయాన్ని మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలకే కేటాయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రోజుకు కొద్ది నిమిషాలైనా పిల్లలతో గడపడం, వారి పాఠశాల విషయాలు అడగడం, వారి ఆనందాలు, బాధలు పంచుకోవడం, ప్రేమగా ఆలింగనం చేసుకోవడం కుటుంబంలో ఆప్యాయతను మరింత పెంచుతుంది. ఇది పిల్లల్లో ఒంటరితనాన్ని కూడా తగ్గిస్తుంది. పిల్లలు చిన్న చిన్న విజయాలు సాధించినప్పుడు వారిని అభినందిస్తూ ఆలింగనం చేసుకోవడం వారికి మరింత ఉత్సాహాన్ని ఇస్తుంది. అదే విధంగా అపజయం ఎదురైనప్పుడు కూడా ప్రేమతో దగ్గరకు తీసుకుని ధైర్యం చెప్పడం ఎంతో అవసరం. తల్లిదండ్రుల ప్రేమపూర్వక ప్రోత్సాహం పిల్లలకు జీవితంలో ఎప్పటికీ మరువలేని బలాన్ని అందిస్తుంది. మార్కుల కంటే పిల్లల మనసు ముఖ్యమనే విషయాన్ని ప్రతి తల్లిదండ్రి గుర్తుంచుకోవాలి. ప్రేమతో చెప్పిన ఒక్క మాట, ప్రేమగా ఇచ్చిన ఒక ఆలింగనం ఎన్నో సమస్యలకు పరిష్కారంగా మారుతుంది.

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రేమతో కూడిన ఆలింగనం వల్ల శరీరంలో ప్రశాంతతను కలిగించే హార్మోన్లు విడుదలవుతాయి. దీంతో ఒత్తిడి తగ్గి మనసుకు ప్రశాంతత లభిస్తుంది. పిల్లల్లో భయం, ఆందోళన, ఒంటరితనం వంటి భావాలు తగ్గి ఆనందం పెరుగుతుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు తల్లిదండ్రుల నుంచి ఆప్యాయతను పొందినప్పుడు వారి భావోద్వేగ వికాసం మరింత మెరుగ్గా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ సభ్యుల మధ్య సాన్నిహిత్యం కూడా పెరుగుతుంది. పిల్లలు తప్పులు చేసినప్పుడు వారిని కేవలం మందలించడం కంటే ఆ తప్పును ఎందుకు చేయకూడదో ప్రేమగా వివరించడం ఉత్తమ మార్గం. అనంతరం వారిని దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకోవడం ద్వారా తల్లిదండ్రులపై విశ్వాసం మరింత పెరుగుతుంది. భయంతో కాకుండా ప్రేమతో పెరిగిన పిల్లలు మంచి విలువలను అలవర్చుకుంటారు. బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కూడా వారికి పెరుగుతుంది. క్రమశిక్షణతో పాటు ప్రేమ కూడా సమానంగా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

డిజిటల్ ప్రపంచంలో పిల్లలు ఎక్కువ సమయం తెరల ముందే గడుపుతున్నారు. దీనివల్ల కుటుంబ సభ్యులతో ప్రత్యక్ష సంభాషణలు తగ్గిపోతున్నాయి. ప్రతిరోజూ కొంత సమయం మొబైల్ ఫోన్లను పక్కనపెట్టి కుటుంబ సభ్యులంతా కలిసి గడపడం ఎంతో అవసరం. పిల్లలతో ఆటలు ఆడడం, కథలు చెప్పడం, కలిసి భోజనం చేయడం, ప్రేమగా ఆలింగనం చేసుకోవడం వంటి చిన్న అలవాట్లు వారి బాల్యాన్ని మరింత అందంగా మార్చుతాయి. ఇలాంటి జ్ఞాపకాలు జీవితాంతం వారితోనే ఉంటాయి. పిల్లల పెంపకంలో ప్రేమ, గౌరవం, సహనం అనే మూడు విలువలు ఎంతో ముఖ్యమైనవి. తల్లిదండ్రులు ఇంట్లో ఎలా ప్రవర్తిస్తారో పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. పెద్దలను గౌరవించడం, ఇతరులను ఆదరించడం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం వంటి మంచి లక్షణాలు కుటుంబ వాతావరణంలోనే పెంపొందుతాయి. ప్రేమతో నిండిన ఇంట్లో పెరిగిన పిల్లలు సమాజంలో కూడా మంచి పౌరులుగా ఎదిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ప్రపంచ పిల్లలను ఆలింగనం చేసుకునే దినం ఒక ప్రత్యేక దినంగా మాత్రమే కాకుండా ప్రతి కుటుంబానికి ఒక విలువైన సందేశంగా నిలుస్తోంది. పిల్లలతో ప్రతి రోజూ కొంత సమయం గడపడం, వారి మాటలను శ్రద్ధగా వినడం, వారి కలలను ప్రోత్సహించడం, అవసరమైనప్పుడు ప్రేమగా ఆలింగనం చేసుకోవడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత. ఇలాంటి చిన్న చిన్న చర్యలే పిల్లల జీవితంలో పెద్ద మార్పులకు కారణమవుతాయి. ప్రేమతో పెరిగిన పిల్లలే రేపటి సమాజాన్ని మరింత అందంగా తీర్చిదిద్దగలరు. చిన్న ఆలింగనం వెనుక అపారమైన ప్రేమ, భరోసా, ఆప్యాయత దాగి ఉంటాయి. పిల్లలు ఎంత పెద్దవారైనా తల్లిదండ్రుల ప్రేమను కోరుకుంటూనే ఉంటారు. అందుకే ఈ ప్రత్యేక దినం సందర్భంగా మాత్రమే కాకుండా ప్రతి రోజూ పిల్లలను ప్రేమగా దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకోవడం ఒక అలవాటుగా మార్చుకోవాలి. కుటుంబ బంధాలను బలపరిచే ఈ చిన్న చర్య పిల్లల జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయే మధుర జ్ఞాపకాలను సృష్టిస్తుంది. ప్రేమతో నిండిన కుటుంబాలే ఆరోగ్యకరమైన, ఆనందకరమైన, విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి బలమైన పునాది అవుతాయి.






# కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంది

- **బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి**



**హన్మకొండ,జులై19(తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని, కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు.

హన్మకొండ జూలైవాడలో బీఆర్ఎస్ యువ నాయకుడు అంకం లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన కార్మికులకు లేబర్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణలో కార్మికుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా నమోదైన కార్మికులకు ప్రమాద బీమా, ప్రసూతి సహాయం, పిల్లల విద్యా సహాయం, వివాహ సహాయం, అంత్యక్రియల ఆర్థిక సహాయం తదితర పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు.

సమాజ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని, వారి శ్రమతోనే రాష్ట్ర నిర్మాణం సాధ్యమైందని అన్నారు. మొదటి విడతలో సుమారు 500 మంది కార్మికులకు లేబర్ కార్డులు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అంకం లక్ష్మణ్ సేవాభావాన్ని అభినందించారు. ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న జూలైవాడ పెద్దలు, మేధావులు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

"ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న" అనే స్ఫూర్తితో ప్రజాసేవ చేస్తున్న యువ నాయకులను బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని, అంకం లక్ష్మణ్ వంటి సేవాభావం కలిగిన నాయకులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి రామస్వామి, ఆరూరి విష్ణు, అయినవోలు సర్పంచ్ రఘువంశీ, గునిగంటి చందర్, కంది యాదగిరి, పురుషోత్తం యాదవ్, బలవంతుల అశోక్, మురళి, సంభరాజు, శివరాత్రి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన పీవీ సింధు





- **జపాన్ ఓపెన్ గెలిచిన తొలి భారత మహిళ**
- **ప్రపంచ వేదికపై మరోసారి భారత కీర్తి పతాకం**

**హైదరాబాద్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరోసారి చరిత్ర సృష్టించింది. ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుని ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా రికార్డు నెలకొల్పింది. ఎన్నో ఏళ్లుగా ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణిగా కొనసాగుతున్న సింధు, మరో అరుదైన విజయాన్ని తన ఖాతాలో వేసుకుని భారత క్రీడా చరిత్రలో మరో స్వర్ణాధ్యాయాన్ని లిఖించింది. ఆమె విజయంతో దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తుండగా, రాజకీయ, క్రీడా, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. భారత జెండాను మరోసారి అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించిన సింధు విజయాన్ని దేశం గర్వంగా స్వాగతిస్తోంది. జపాన్ ఓపెన్ ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ టోర్నీలో విజేతగా నిలవడం ప్రతి క్రీడాకారుడి కలగా భావిస్తారు. అలాంటి పోటీలో అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకున్న సింధు భారత మహిళా బ్యాడ్మింటన్‌కు కొత్త గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఏ భారత మహిళా షట్లర్‌కు సాధ్యం కాని ఘనతను అందుకోవడం ద్వారా ఆమె తన ప్రత్యేకతను మరోసారి నిరూపించింది. అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడిని అధిగమిస్తూ నిలకడగా రాణించడం సింధు గొప్పతనానికి నిదర్శనమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒలింపిక్స్ పతకాలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణం, కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, అంతర్జాతీయ టోర్నీల్లో అనేక విజయాలతో ఇప్పటికే భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన సింధు, ఇప్పుడు జపాన్ ఓపెన్ టైటిల్‌ను కూడా తన విజయాల జాబితాలో చేర్చుకుంది. ప్రతి విజయంతో కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. క్రమశిక్షణ, కఠోర సాధన, ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ప్రపంచ వేదికపై అత్యున్నత విజయాలు సాధించవచ్చని సింధు తన ప్రస్థానంతో నిరూపించింది. భారత బ్యాడ్మింటన్‌కు ప్రపంచవ్యాప్తంగా మరింత గౌరవాన్ని తీసుకురావడంలో ఆమె పాత్ర విశేషమని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు. సింధు విజయంపై దేశవ్యాప్తంగా అభినందనల వెల్లువ కొనసాగుతోంది. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, రాజకీయ ప్రముఖులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. భారత క్రీడా రంగానికి మరో అపూర్వ విజయాన్ని అందించినందుకు ఆమెను కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో భారత మహిళల ప్రతిభను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ఈ విజయం దేశ యువతకు స్ఫూర్తినిస్తుందని అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో కూడా సింధు విజయంపై లక్షలాది మంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

భారతదేశంలో బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి సింధు విజయాలు విశేషంగా దోహదపడుతున్నాయి. ఆమె విజయాలను చూసి అనేక మంది యువత ఈ క్రీడ వైపు ఆకర్షితులవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో సాధన చేస్తున్న యువ క్రీడాకారులకు ఆమె ప్రస్థానం మార్గదర్శకంగా నిలుస్తోంది. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, శాస్త్రీయ శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాల కోచింగ్ అందుబాటులోకి రావడంతో భారత క్రీడాకారులు ప్రపంచస్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. సింధు తాజా విజయం భారత బ్యాడ్మింటన్‌కు మరింత ఉత్సాహాన్ని అందించనుంది. పీవీ సింధు సాధించిన ఈ చారిత్రాత్మక విజయం భారత క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోనుంది. ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను మరింత పెంచుతూ వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆమెపై దేశ ప్రజల ఆశలు మరింత పెరిగాయి. రానున్న అంతర్జాతీయ టోర్నీలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, ఇతర ప్రతిష్ఠాత్మక పోటీల్లో కూడా ఇదే విజయపరంపర కొనసాగించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. దేశానికి మరిన్ని స్వర్ణ క్షణాలను అందిస్తూ భారత జెండాను ప్రపంచవ్యాప్తంగా మరింత ఎత్తులో ఎగురవేయాలని ప్రతి భారతీయుడు కోరుకుంటున్నాడు.




# సింధుకు సీఎం అభినందనలు

- **జపాన్ ఓపెన్‌లో టైటిల్ విజయం**
- **భారత క్రీడలకు గర్వకారణమన్న సీఎం**
- **మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**

జపాన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయంతో దేశ క్రీడా రంగానికి మరో గర్వకారణం లభించిందని పేర్కొన్నారు. పీవీ సింధు తన కెరీర్‌లో తొలి సూపర్-750 టైటిల్‌ను సొంతం చేసుకోవడం విశేషమని ముఖ్యమంత్రి అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తిని మరింత పెంచిన ఈ విజయం ప్రతి భారతీయుడికి ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. అసాధారణ ప్రతిభ, కఠోర శ్రమ, అంకితభావం, పట్టుదలతో పీవీ సింధు ప్రపంచ స్థాయిలో ఎన్నో విజయాలు సాధించారని సీఎం కొనియాడారు. ప్రతి టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ భారత క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

దేశ యువతకు పీవీ సింధు స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచారని ముఖ్యమంత్రి అన్నారు. క్రీడల పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, నిరంతర సాధనతో విజయాలను అందుకుంటున్న సింధు మరెందరో యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ వేదికలపై ఇదే జోరు కొనసాగించి మరిన్ని టైటిళ్లు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భారత జెండాను ప్రపంచ వేదికపై మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. జపాన్ ఓపెన్ సూపర్-750 టైటిల్ విజయంతో పీవీ సింధు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆమె సాధించిన ఈ విజయం భారత బ్యాడ్మింటన్ చరిత్రలో మరో మైలురాయిగా నిలుస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అభివృద్ధి పనులకు శ్రీకారం

- **కామేపల్లిలో శంకుస్థాపనలు చేసిన భట్టి**
- **విద్యుత్, రహదారి పనులకు ప్రాధాన్యం**
- **ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యం**

**ఖమ్మం, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**



ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలంలో విద్యుత్, రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజల సమక్షంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణతో వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెంచుతున్నట్లు వెల్లడించారు.

రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలు కూడా వేగవంతమవుతాయని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వంటి రంగాలకు మెరుగైన రహదారులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్, మెరుగైన రహదారులు, వేగవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకూ సమానంగా చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల విస్తరణ కొనసాగుతుందని తెలిపారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు వేగంగా మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు, తాగునీరు, రవాణా వంటి రంగాల్లో మరిన్ని పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు సంకల్పం వ్యక్తం చేశారు. కామేపల్లి మండలంలో చేపట్టనున్న ఈ పనులు పూర్తయిన తర్వాత విద్యుత్, రహదారి సౌకర్యాలు మరింత మెరుగుపడి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం కావాలి

- **మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఆదేశం**
- **రైతులకు ప్రత్యామ్నాయ పంటల సూచన**
- **తాగునీటికి అత్యధిక ప్రాధాన్యం**
- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**కరీంనగర్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**



సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కొని రైతులు, ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లాల పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. సమీక్ష సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్ల నుంచి సాగునీటిని విడుదల చేసే పరిస్థితి లేదని, భూగర్భ జలాల మట్టం పది మీటర్ల వరకు పడిపోయిందని తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు వరి సాగుపై తొందరపడకుండా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్ పామ్, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

తాగునీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. నీటి వినియోగంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అవసరమైన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కరోనా సమయంలో ప్రభుత్వ యంత్రాంగం చూపిన సమన్వయ స్ఫూర్తితోనే సూపర్ ఎల్‌నినో సవాల్‌ను కూడా అధిగమించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేస్తే ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చని ఆయన పేర్కొన్నారు.



# గాయపడిన గీత కార్మికుడిని పరామర్శించిన శ్రీనివాస్ గౌడ్

- **ఆసుపత్రిలో బాధితుడికి ధైర్యం**
- **రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని డిమాండ్**
- **గీత కార్మికులకు అండగా నిలవాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**

నల్గొండ జిల్లా దోమలపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు సత్తయ్య గౌడ్ చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, సత్తయ్య గౌడ్‌కు అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. ప్రమాదం నుంచి పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చెట్టుపై నుంచి పడి పది రోజులు గడిచినా ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఎవరూ బాధితుడిని పరామర్శించకపోవడం బాధాకరమని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ విషయమై నల్గొండ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, ప్రభుత్వం తరఫున అందాల్సిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి మరణించినా లేదా తీవ్రంగా గాయపడినా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా చెట్టుపై నుంచి పడి సుమారు 600 మంది గీత కార్మికులు ప్రమాదాలకు గురయ్యారని పేర్కొన్న శ్రీనివాస్ గౌడ్, వారందరికీ ఎలాంటి జాప్యం లేకుండా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదాల నివారణకు కూడా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గీత పారిశ్రామిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్, రామ్మూర్తి, ఇతర నాయకులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా సహకారం అందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.




# శేఖర్ స్మారక అవార్డుల ప్రదానం

- **సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వేడుక**
- **కళాకారులను సత్కరించిన కేటీఆర్**
- **కళలకు ప్రోత్సాహమే సమాజ బాధ్యత**

**హైదరాబాద్, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రముఖ కార్టూనిస్ట్ కంబాలపల్లి శేఖర్ స్మారకార్థం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డ్స్-2026 ప్రదానోత్సవంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్టూన్, చిత్రలేఖన రంగాల్లో విశిష్ట సేవలు అందించిన కళాకారులను సత్కరించి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు, రచయితలు, కవులు, పాత్రికేయులు, చిత్రకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళా రంగానికి సేవలందించిన వారి కృషిని గుర్తించి సత్కరించడం సమాజ బాధ్యత అని కేటీఆర్ పేర్కొన్నారు. కళాకారుల ప్రతిభను మరింత ప్రోత్సహించే వేదికలు పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమ కాలంలో కంబాలపల్లి శేఖర్ గీసిన కార్టూన్లు, చిత్రాలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించడంలో కీలక పాత్ర పోషించాయని కేటీఆర్ గుర్తు చేశారు. సామాజిక, రాజకీయ అంశాలను తన కలంతో ప్రజలకు చేరువ చేసిన అరుదైన కళాకారుడిగా శేఖర్ నిలిచిపోయారని కొనియాడారు. ఆయన కార్టూన్లు కేవలం వినోదానికి పరిమితం కాకుండా సమాజంలో చైతన్యం నింపాయని అన్నారు. ఉద్యమ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో శేఖర్ సృజనాత్మకతకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. అలాంటి కళాకారులను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

ఈ సందర్భంగా కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం. నారుకు, ఆర్టిస్ట్ విభాగంలో చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్‌కు కేటీఆర్ ఇతర అతిథులతో కలిసి శేఖర్ మెమోరియల్ అవార్డులను ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను అభినందిస్తూ వారి సృజనాత్మక ప్రయాణం మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కళా రంగంలో వారి సేవలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కళాకారుల కృషికి సమాజం తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు. ఇటువంటి అవార్డులు కళారంగ అభివృద్ధికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. కళాకారులు, రచయితలు, కవులు, చిత్రకారులతో ఒకే వేదికపై కలుసుకునే అవకాశాలు చాలా అరుదుగా వస్తాయని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ ఉద్యమ కాలం నాటి ఎన్నో జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసిందని చెప్పారు. ఉద్యమ సమయంలో సాంస్కృతిక రంగం పోషించిన పాత్రను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సాహిత్యం, చిత్రకళ, కార్టూన్లు ప్రజల్లో చైతన్యాన్ని పెంచడంలో ఎంతో ప్రభావం చూపాయని పేర్కొన్నారు. సమాజ మార్పులో కళాకారుల పాత్ర ఎంతో విలువైనదని అన్నారు.

కళను ప్రోత్సహించడం ప్రభుత్వాలకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న కళాకారులకు తగిన అవకాశాలు కల్పిస్తే దేశ సాంస్కృతిక సంపద మరింత విస్తరిస్తుందని చెప్పారు. యువ కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని సూచించారు. సృజనాత్మకతకు ప్రోత్సాహం లభిస్తే కొత్త తరానికి మరింత ఉత్సాహం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. కళా, సాహిత్య రంగాల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఏడాది నుంచి శేఖర్ మెమోరియల్ అవార్డులను మరింత ఘనంగా నిర్వహించేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ అవార్డులు రాష్ట్రంలోని ప్రతిభావంతులైన కళాకారులకు మరింత ప్రేరణగా నిలిచేలా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపులో నిర్వాహకులు, అవార్డు గ్రహీతలు, అతిథులను అభినందించిన ఆయన, కంబాలపల్లి శేఖర్ సేవలను చిరస్థాయిగా నిలబెట్టే ప్రయత్నాలకు తన మద్దతు కొనసాగుతుందని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# ఆస్ట్రేలియాలో భారత వైమానిక దళం విన్యాసాలు

- నేటి నుంచి పిచ్ బ్లాక్ విన్యాసాలు
- బహుళ దేశాల వైమానిక దళాల భాగస్వామ్యం
- రాత్రి యుద్ధ విన్యాసాలకు ప్రత్యేక ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత వైమానిక దళం ఆస్ట్రేలియాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక బహుళ దేశాల వైమానిక యుద్ధ విన్యాసాల్లో పాల్గొననుంది. జూలై 20 నుంచి ఆగస్టు 7 వరకు ఆస్ట్రేలియాలోని డార్విన్ రాయల్ ఆస్ట్రేలియన్ వైమానిక దళ స్థావరంలో నిర్వహించే 'పిచ్ బ్లాక్-2026' విన్యాసాల్లో భారత వైమానిక దళం తన సామర్థ్యాన్ని ప్రదర్శించనుంది. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ విన్యాసాలు రాయల్ ఆస్ట్రేలియన్ వైమానిక దళం అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా గుర్తింపు పొందాయి. వివిధ దేశాలకు చెందిన వైమానిక దళాలు ఒకే వేదికపై కలిసి సంక్లిష్టమైన యుద్ధ పరిస్థితుల్లో సమన్వయంతో నిర్వహించే చర్యలను ఈ విన్యాసాల్లో అభ్యసిస్తాయి. అంతర్జాతీయ స్థాయిలో పరస్పర సహకారం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

ఉత్తర ఆస్ట్రేలియాలో జనసంచారం తక్కువగా ఉండే విశాల ప్రాంతాల్లో రాత్రివేళల్లో విమాన విన్యాసాలు నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. అందుకే దీనికి 'పిచ్ బ్లాక్' అనే పేరు వచ్చింది. రాత్రి యుద్ధ విన్యాసాలు, వ్యూహాత్మక వైమానిక చర్యలు, సమన్వయ కార్యకలాపాలకు ఈ విన్యాసాలు వేదికగా నిలుస్తాయి. ఈ ఏడాది నిర్వహిస్తున్న పిచ్ బ్లాక్ విన్యాసాలు గత 45 ఏళ్ల చరిత్రలోనే అతిపెద్దవిగా నిలవనున్నాయి. అత్యధిక సంఖ్యలో దేశాల వైమానిక దళాలు, సైనిక సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. భారీ స్థాయిలో బహుళ దేశాల వైమానిక యుద్ధ విన్యాసాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

వివిధ దేశాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు ఆధునిక యుద్ధ విధానాలపై అనుభవాన్ని పంచుకోవడానికి ఈ విన్యాసాలు దోహదపడనున్నాయి. సాంకేతిక నైపుణ్యాలు, కార్యాచరణ సామర్థ్యాలు, సమిష్టి ప్రతిస్పందనను మరింత మెరుగుపర్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. భారత వైమానిక దళం ఈ అంతర్జాతీయ విన్యాసాల్లో పాల్గొనడం ద్వారా ప్రపంచ స్థాయి వైమానిక దళాలతో కలిసి పనిచేసే అనుభవాన్ని మరింత విస్తరించుకోనుంది. అంతేకాకుండా ఆధునిక యుద్ధ వ్యూహాలు, సంయుక్త కార్యాచరణ పద్ధతులపై విలువైన అనుభవాన్ని సొంతం చేసుకుంటుందని రక్షణ వర్గాలు వెల్లడించాయి.



# మూడు దేశాల పర్యటనకు రాష్ట్రపతి

- మోల్డోవా, ఉత్తర మాసిడోనియాకు తొలి పర్యటన
- మూడు దశాబ్దాల తర్వాత రొమేనియా సందర్శన
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

**న్యూఢిల్లీ, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు యూరప్ దేశాల అధికారిక పర్యటనకు బయలుదేరారు. మోల్డోవా, ఉత్తర మాసిడోనియా, రొమేనియా దేశాల్లో ఆమె పర్యటించనున్నారు. ఈ పర్యటనల ద్వారా ఆయా దేశాలతో భారతదేశం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత రాష్ట్రపతి హోదాలో మోల్డోవా, ఉత్తర మాసిడోనియా దేశాలను సందర్శించడం ఇదే తొలిసారి. ఈ చారిత్రాత్మక పర్యటనతో రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని అధికారులు తెలిపారు. రొమేనియాకు భారత రాష్ట్రపతి అధికారికంగా వెళ్లడం మూడు దశాబ్దాలకుపైగా విరామం తర్వాత జరుగుతోంది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహ సంబంధాలకు మరింత బలం చేకూర్చుతుందని భావిస్తున్నారు.

పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయా దేశాల అధ్యక్షులు, ప్రభుత్వ ప్రధానులు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరపనున్నారు. ద్వైపాక్షిక సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంకేతికత తదితర రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. భారత్‌తో స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ పర్యటనలు కీలకంగా మారనున్నాయని విదేశాంగ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ వేదికలపై పరస్పర సహకారం పెంపొందించుకోవడంతో పాటు ప్రజల మధ్య సంబంధాలను కూడా మరింత బలోపేతం చేయాలని ఇరు పక్షాలు భావిస్తున్నాయి. భారత విదేశాంగ విధానంలో యూరప్ దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రపతి ఈ పర్యటనలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటనలు భారత్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత బలమైన దౌత్య సంబంధాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సరిహద్దు భద్రతపై అమిత్ షా సమీక్ష

- అత్యాధునిక సాంకేతికతల పరిశీలన
- సరిహద్దు భద్రతకు కొత్త వ్యవస్థలు
- పరికరాల పనితీరును పరిశీలించిన కేంద్ర మంత్రి

**సిలిగురి, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి సమీపంలోని జుమాగఛ్ సరిహద్దు భద్రతా కేంద్రాన్ని సందర్శించి సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేసేందుకు అభివృద్ధి చేసిన స్వదేశీ అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలను పరిశీలించారు. దేశ సరిహద్దుల రక్షణలో సాంకేతికత పాత్రను మరింత పెంచే చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సరిహద్దు భద్రతా సిబ్బంది వినియోగిస్తున్న పలు ఆధునిక పరికరాల పనితీరును అమిత్ షా పరిశీలించారు. చొరబాట్లను అరికట్టేందుకు రూపొందించిన స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, పర్యవేక్షణ వ్యవస్థలు, భద్రతా పరికరాల సామర్థ్యంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రేడియో ఆధారిత కంచె ధ్వంసం గుర్తింపు వ్యవస్థను కూడా పరిశీలించారు. సరిహద్దు కంచెను ఎవరైనా ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఈ వ్యవస్థ వెంటనే గుర్తించి ముందుగా నమోదు చేసిన హెచ్చరిక సందేశాన్ని ప్రసారం చేస్తూ భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేస్తుందని అధికారులు వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో సరిహద్దు భద్రతను మరింత సమర్థవంతంగా మార్చడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చొరబాట్లు, అక్రమ కార్యకలాపాలను వేగంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునేలా ఈ వ్యవస్థలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఆధునిక పరికరాల వినియోగాన్ని మరింత విస్తరించి భద్రతను పటిష్ఠం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పర్యటనలో సరిహద్దు భద్రతా దళం ఉన్నతాధికారులు, కేంద్ర హోంశాఖ అధికారులు పాల్గొన్నారు. సరిహద్దు భద్రతకు సంబంధించిన తాజా సాంకేతిక వ్యవస్థలపై అమిత్ షా సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# సింగపూర్‌కు కశ్మీర్ పండ్ల ఎగుమతి

- చెర్రీ, ప్లమ్ తొలి రవాణా
- రైతులకు మెరుగైన ధరల అవకాశం
- వ్యవసాయ ఎగుమతులకు కొత్త ఊపు

**న్యూఢిల్లీ, జూలై 19 (తెలంగాణ ముచ్చట్లు):**



జమ్మూ కశ్మీర్‌లోని షోపియాన్, పుల్వామా జిల్లాల ఉద్యాన రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ సహకారంతో ప్రీమియం నాణ్యత కలిగిన అరేకో చెర్రీ, సెంటరోజ్ ప్లమ్ పండ్ల తొలి ఎగుమతి సరుకును సింగపూర్‌కు పంపించారు. ఈ చర్యతో కశ్మీర్ పండ్లకు అంతర్జాతీయ మార్కెట్లో మరింత గుర్తింపు లభించనుంది. ఈ ఎగుమతుల ద్వారా స్థానిక ఉద్యాన రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు విదేశీ మార్కెట్లకు నేరుగా చేరుకునే అవకాశం కలుగుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు భారత వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా కొత్త అవకాశాలు సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఉన్నత నాణ్యత కలిగిన చెర్రీ, ప్లమ్ పండ్లను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎంపిక చేసి సింగపూర్‌కు ఎగుమతి చేశారు. ఈ ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలు, ప్యాకింగ్, రవాణా విధానాలను అత్యంత జాగ్రత్తగా అమలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కశ్మీర్ ఉద్యాన రంగానికి మరింత ప్రోత్సాహం లభించనుందని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ పండ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో మరిన్ని ఎగుమతులను చేపట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ రైతులను ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం చేయడానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఎగుమతుల ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందని అధికారులు తెలిపారు. వ్యవసాయ ఎగుమతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రైతులకు ప్రపంచ స్థాయి మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భారత వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# చరిత్ర సృష్టించిన రోహిత్-కోహ్లీ జోడీ..

## కలిసి 400 అంతర్జాతీయ మ్యాచ్‌ల మైలురాయి

భారత మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనతను తమ ఖాతాలో వేసుకున్నారు. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో వన్డేలో బరిలోకి దిగిన ఈ స్టార్ జోడీ కలిసి 400 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన తొలి భారత క్రికెటర్లుగా చరిత్ర సృష్టించింది.

టీ20, టెస్టు క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌పైనే దృష్టి సారించారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ఈ ఇద్దరూ లార్డ్స్ వన్డేలో ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషంగా నిలిచింది. ఇప్పటివరకు ఏ భారత జోడీ కూడా ఈ ఘనత సాధించలేదు.

విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 562 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 28,285 పరుగులు సాధించాడు. 85 సెంచరీలు నమోదు చేసిన కోహ్లీ అత్యధిక వ్యక్తిగత స్కోరు 254 నాటౌట్. మరోవైపు రోహిత్ శర్మ 514 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 20,289 పరుగులు చేశాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 112 అర్ధసెంచరీలు నమోదు చేసిన రోహిత్ అత్యధిక వ్యక్తిగత స్కోరు 264 పరుగులు.

భారత క్రికెట్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన ఈ ఇద్దరు దిగ్గజాలు మరో చారిత్రక రికార్డును తమ పేరిట నమోదు చేసుకోవడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in